
ప్రజాశక్తి
శుక్రవారం 14 మార్చి 2025
5
పార్వతీపురం మన్యం



హోలీ పేరుతో హద్దు మీరొద్దు

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ఆనందంతో హద్దులు మీరి ప్రవర్తించకండి ఆనందంగా ఐక్యతతో మతసామరస్యానికి ప్రతీకగా హెూలీ పండుగ జరుపుకుందాం, పండుగ పేరుతో ఇతరులకు ఇబ్బంది కలిగించి, మీరు ఇబ్బందులకు గురికావద్దని ఎస్పీ ఎస్ వి మాధవ్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం జరిగే హెూళీ పండుగ సందర్భంగా పోలీస్ అధికారులకు, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. ఎవరైనా రోడ్లమీద వెళ్లే వారిపైనా, ఇతరులపైనా బలవంతంగా రంగులు చల్లితే కఠిన చర్యలు తీసుకుంటామని, ముఖ్యంగా మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినా, వేధించినా, అసాంఘిక కార్యక్రమాలు చేపడితే అలాంటి వారిపై కఠినమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

లక్ష్యానికి ఆమడ దూరాన 'ఉపాధి'

మిగిలింది మరో 15 రోజులే

8వారాలుగా అందని వేతనాలు



ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

ప్రజాశక్తి - సీతంపేట

జిలాల్లో పనులు మండలాల్లో ఉపాధిహామీ పనులు లక్ష్యానికి ఆమడ దూరానుంది. గ్రామాల్లో రోడ్లు, ప్రహరీగోడలు, సిసి రోడ్లు, కాలువలు, చెరువులు, వ్యవసాయ పనులను ఉపాధిహామీ చట్టానికి అనుసంధానం చేశారు. ఇలా ప్రతి పనిని ఉపాధి హామీ పథకం ద్వారా చేయిస్తున్నారు. అంతవరకు బాగానే ఉన్నా ఆ మేరకు పనులు జరగడంలేదు. జాబ్‌కార్డులున్న వారందరికీ పనులు కల్పించడంలోనూ, పనులు చేసిన కూలీలకు వేతనాలు చెల్లించడంలోనూ తీవ్ర జాప్యం జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఈనెలాఖరుతో ముగియనుండడంతో లక్ష్యాన్ని పూర్తి చేయకపోతే నిధులు వెనక్కి మళ్లే పరిస్థితి ఉంది. ఈ తక్కువ వ్యవధిలో అధికారులు లక్ష్యాన్ని ఏ మేరకు అధిగమిస్తారో వేచి చూడాల్సిందే.

మండలంలో 14,16,6 కుటుంబాలకు జాబ్ కార్డులు ఉన్నాయి. 2వేల పనులకు రూ.50 కోట్లు మంజూరు కాగా, ఇప్పటి వరకు 1500 పనులకు రూ.32 కోట్ల 24 లక్షలు వేతనదారులకు చెల్లించారు. వీరిలో ప్రతి ఒక్కరికి వంద రోజులు పని కల్పించాల్సి ఉంది. దీంతో పాటు రోజుకు కొలతల ప్రకారం ఆరు గంటలు పనిచేసి సరాసరిగా రూ.257 వేతనదారుడికి గిట్టుబాటు అందించాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకు సుమారు 7వేల కుటుంబాలకు మాత్రమే వంద రోజులు పని కల్పించారు. ఇంకా 7166 కుటుంబాలకు వంద రోజులు పని పూర్తి కాలేదు. గతేడాది మార్చి నుంచి ఈ ఏడాది మార్చి 30కు 14,166 కుటుంబాలకు వంద రోజులు ఉపాధి పని కల్పించాల్సి ఉంది. ఈ లక్ష్యం ఈనెలా ఖరుకు పూర్తి కావాల్సి ఉంది. మరో 15రోజుల్లో 50శాతం కుటుంబాలకు వంద రోజులు పనిదినాలు కల్పించాలి. సమయం లేకపోవడంతో ఉపాధిహామీ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. దీంతో పాటు ఆరు వారాల పాటు వేతనదారులకు వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. గతంలో మాదిరిగా వారం వారం ఉపాధి కూలి వెంటనే చెల్లిస్తే బాగుంటుందని వేతన దారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

వేతనాల చెల్లింపునకు చర్యలు

కూలీలకు వేతనాలు చెల్లించడానికి చర్యలు తీసుకుంటాం. ఈ నెలాఖరుకల్లా సుమారు 8వేల కుటుంబాలకు వంద రోజులు పని కల్పించడానికి కృషి చేస్తున్నాం.

ఆర్ సాగర్ ,
ఎపిఒ, సీతంపేట.

వేతనాలు చెల్లించాలి



గతంలో మాదిరిగా ఏ వారానికి ఆ వారం ఉపాధి కూలీ లకు వేత నాలు వెంటనే చెల్లించాలి. ఇప్పటికి ఆరు వారాలుగా వేతనాలు పడలేదు. రోజంతా కష్టపడి పనిచేసినా కూలి రాకపోవడంతో జీవనం కష్టంగా ఉంది. చేసిన పనికి వేతనం ఎప్పుడు వస్తుందానని ఎదురు చూస్తాను.

పత్తిక కుమార్,
ఉపాధి వేతనదారుడు, పూతిక వలస

విద్య, ఆరోగ్యం ప్రభుత్వానికి రెండు కళ్లు

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు



అంగన్‌వాడీ కేంద్రంలో వంటలను పరిశీలిస్తున్న రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు కాంతారావు

ప్రజాశక్తి - కురుపాం

విద్యార్థుల విద్య, ఆరోగ్యం ప్రభుత్వానికి రెండు కళ్లు వంటివని రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు బి.కాంతారావు అన్నారు. గురువారం ఆయన కురుపాం, పార్వతీపురం, సీతానగరం మండలాల్లోని హాస్టళ్లను, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. ఇందులో భాగంగా కురుపాంలో గల అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలు, ఎంఎల్ఎస్ పాయింట్, మొబైల్ డిస్పెన్సివ్ యూనిట్ వాహనం ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీని విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. స్థానిక మండల పరిషత్తు పాఠశాల ఆవరణంలో మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ వాహనం ద్వారా అందిస్తున్న సరుకుల పంపిణీని పరిశీలించారు. సరుకుల పంపిణీలో కొలతలు ఏమైనా తేడా ఉన్నదా, ఎంత మేర సరుకులు నిల్వ ఉన్నవి తదితర అంశాలపై పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలలో స్టోర్ రూమ్‌లో సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణ, కోడిగుడ్ల నిల్వలు సక్రమంగా ఉన్నవీ లేనిదీ తనిఖీ చేశారు. అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందిస్తున్న పోషక ఆహారాన్ని, వంటకాలను ఆహార భద్రతాధికారి వై.రామయ్యతో తనిఖీలు నిర్వహించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా అమలు చేయాలని ఆదేశించారు. రక్తహీనత నివారణకు జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధ వహించి అదనపు పౌష్టికాహార కిట్లను అందిస్తున్నందున చిత్తశుద్ధితో పనిచేసి రక్త హీనత బాధితుల సంఖ్య తగ్గించాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. విద్యార్థులకు ఆకు కూరలు, సాంబార్లో క్యారెట్ ఉండేలా జాగ్రత్తలు పాటించాలని కోరారు. జిల్లా పౌరసరఫరాల శాఖ ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించారు. కందిపప్పు, బియ్యం, పంచదార, పామాయిల్ సరుకుల నిల్వలు, రిజిస్టర్ల నిర్వహణను పరిశీలించి వివరాలపై ఆరా తీశారు. రిజిస్టర్‌లోని సరుకుల వివరాలు, గోదాంలోని సరుకులు తూనిక ప్రకారం సరిపడా ఉండడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ నుంచి మోడల్ స్కూల్‌ను సందర్శించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజన వంటకాలను రుచి చూశారు. స్వయంగా విద్యార్థులను వడ్డించి ప్రతిరోజూ మెనూ ప్రకారం సక్రమంగా నాణ్యమైన భోజనం అందిస్తున్నదీ లేనిదీ ఆరా తీశారు. అనంతరం గర్భిణీలకు, బాలింతలకు అదనపు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు.

కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీనివాసరావు, జిసిసి డిఎం మహేంద్ర కుమార్, ఐసిడిఎస్ పీడీ టి.కనకదుర్గ, వైద్య, ఆరోగ్య శాఖ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహన్‌రావు, తూనికలు, కొలతల అధికారి కె.రత్నరాజు, ఎంఇఒ ఎన్.సత్యనారాయణ, ఎబిడబ్ల్యుఒ ఇ.అప్పన్న, ఎఎస్‌డబ్ల్యుఒ పి.రాణి, సిడిపిఒ ఆర్.విజయ గౌరీ, తదితరులు పాల్గొన్నారు.



నవోదయం 2.0 వాహనాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

సారా రహిత జిల్లాగా పార్వతీపురం

ప్రజాశక్తి - పార్వతీపురం

నవోదయం 2.0 కింద నాటు సారారహిత జిల్లాగా పార్వతీపురాన్ని తీర్చిదిద్దాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. గురువారం స్థానిక కలెక్టరేట్‌లో వివిధ శాఖ అధికారులతో నవోదయ 2.0 కార్యక్రమంపై జిల్లా సమన్వయ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా నవోదయ 2.0 ప్రచార రథం, కరపత్రాలు, గోడ పత్రికలను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. జిల్లాలో 137 గ్రామాలను ఎ,బి,సి గ్రామాలుగా వర్గీకరించి సదరు గ్రామాలకు దత్తత అధికారులను నియమించామన్నారు. నాటు సారా సంబంధిత పిర్యాదులు కోసం టోల్ ఫ్రీ నెంబర్ 14405 పై విస్తృత ప్రచారం చేయాలన్నారు. గోడపత్రికలు, కర పత్రాల ద్వారా ప్రచారం చేపట్టాలని సూచించారు. 1,265 పాత నేర చరిత్ర కలిగిన వ్యక్తులను గుర్తించి, వారిలో 191 మందిని బైండోవర్ చేసిన విషయాన్ని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. పోలీసు అధికారులు నాటుసారా గ్రామాలను దత్తత తీసుకోవాలని, పోలీసు, ఎక్సైజ్ అధికారులు సమన్వయంగా దాడులు చేయాలని ఆదేశించారు. అంతరాష్ట్ర సమన్వయ సమావేశాలు కూడా ఏర్పాటు చేయాలని, డ్రోన్లను ఉపయోగించి నాటు సారా తయారీ కేంద్రాల సమాచారం సేకరించి, పటిష్ట నిఘా ఉంచాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. విజబుల్ పోలీసింగ్, సర్ప్రైజ్ చెక్స్, కార్డెన్ చర్చ, సారా తయారీకి ఉపయోగించే నల్లబెల్లం విక్రయించే వర్తకులపై గట్టి నిఘా ఉంచి, వారి పైన కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పార్వతీపురం మున్సిపాలిటీ ఇందిర కాలనీలో ఎక్సైజ్ శాఖ నవోదయ 2.0 ప్రచార రథంతో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాన్ని, ర్యాలీని ఎక్సైజ్, పోలీస్ శాఖలు సంయుక్తంగా చేపట్టాయి. తొలుత కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో నవోదయం 2.0 ప్రచార వాహనానికి జెండా ఊపి కలెక్టర్ ప్రారంభించారు. సమావేశంలో ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ, ఎఎస్‌పి అంకిత సురాన, అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ బి.శ్రీనాధుడు, డిఇఒ ఎన్.తిరుపతి నాయుడు, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. ఎస్.భాస్కరరావు, గిరిజన సంక్షేమ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి టి.కొండలరావు, అసిస్టెంట్ ప్రొహిబిషన్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, ఎక్సైజ్ ఇనస్పెక్టర్లు, దత్తత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

23 నాటికి ఇళ్ల నిర్మాణాలు పూర్తి

ప్రజాశక్తి - పార్వతీపురం

అసంపూర్తిగా ఉన్న ఇళ్ల నిర్మాణాల సర్వేను ఈనెల 2 నాటికి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. వివిధ శాఖల ప్రగతిని గురువారం కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్టేజ్ అప్ గ్రేడ్ విధిగా జరగాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇనుము ధర తగ్గుదల ఉందని, ఇసుక లభ్యంగా ఉందని, ఉపాధి హామీ కింద వేతనాలు పెరిగాయని, మరుగుదొడ్లు లేని వారికి మంజూరు చేస్తామని తెలిపారు. ఈనెల 20 నాటికి మొదటి దశ పూర్తి చేస్తే ఈనెల 21 నాటికి వారి ఖాతాల్లో నగదు జమ అవుతుందని చెప్పారు. జిల్లాలో వివిధ దశల్లో నిర్మాణాలు ఆగిన బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు చెందిన 10,717 గృహాలు ఉన్నాయని ఆయన చెప్పారు. వీటిని త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

పి4 సర్వే త్వరగా పూర్తి చేయండి

పి4 సర్వేలో భామిని, బలిజీపేట మండలాలు వెనుకబడి ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. వీటిని త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు.

ఉపాధి హామీ లో 334 ప్రహరీలు

ఉపాధి హామీ కింద జిల్లాలో 334 ప్రహరీ గోడలు, 988 గోశాలలు, 7342 ఇంకుడు గుంతలు మంజూరు అయ్యాయని చెప్పారు. 311 ప్రహరీ గోడలు, 894 గోశాలలు నిర్మాణం ప్రారంభం అయ్యాయని, 4284 ఇంకుడు గుంతలు పూర్తి అయ్యాయని ఆయన వివరించారు. బిల్లులు చెల్లింపులకు వెంటనే అప్ లోడ్ చేయాలని ఆయన అన్నారు. ఉపాధి వేతనదారుల వేతనాలు నిర్దేశిత వేతన స్థాయికి చేరుకోవాలని ఆయన చెప్పారు. పంట గుంతలను అధిక సంఖ్యలో ఏర్పాటు చేయాలని అన్నారు. జిల్లాలో 11250 లక్ష్యంగా ఉందని, వీటిని పెద్ద ఎత్తున వినియోగించుకోవడం వల్ల సుస్థిర ఆర్థిక ప్రగతికి దోహదం చేస్తుందని అన్నారు. సమావేశంలో కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు ఎం.సుధారాణి, కె.రామచంద్ర రావు, ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి తమర్బ కొండలరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్.భాస్కర రావు, తదితరులు పాల్గొన్నారు.

15న ప్రతి గ్రామంలో స్వచ్ఛంధ్రా - స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఈనెల 15న ప్రతి గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో స్వచ్ఛంద్రా - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పేర్కొన్నారు. ప్రభుత్వం రూపొందించిన యాప్‌లో స్వచ్ఛంద్రా కార్యక్రమాల వివరాలను నమోదు చేయాలని కలెక్టర్ తహశీల్దార్లకు సూచించారు. స్థానిక కలెక్టరేట్‌లో గురువారం సబ్ కలెక్టర్లు, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రీసర్వే పక్కగా జరగాలని, రీసర్వేను వీలైనంత త్వరగా పూర్తిచేయాలని ఆదేశించారు. పిఎంఎవై 1.0 కింద ఇళ్లు మంజూరై వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్న బిసి, ఎస్సి, ఎస్‌టిలకు యూనిట్ విలువకు అదనంగా ఆర్థిక సహాయం అందిస్తుందన్న సంగతిని లబ్దిదారులకు వివరించి, త్వరితగతిన పూర్తిచేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ సదస్సులు, రీసర్వే గ్రామసభలో వచ్చిన విజ్ఞప్తులపై మండల అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.మ్యూటేషన్లు, అడంగల్ తదితర వాటిపై తక్షణమే స్పందించాలని, సమస్యలున్న చోట వాటి పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని హితవు పలికారు. స్రిబిజి కొరకు ప్రతి మండలంలో 500 ఎకరాల వరకు ప్రభుత్వ స్థలం అవసరమని, స్థలం అందుబాటులో ఉన్న మండలాల వివరాలు తమకు సమర్పించాలని కలెక్టర్ కోరారు. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని, క్షేత్రస్థాయిలో పరిశీలించి వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ తెలిపారు.

సమావేశంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్ ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మ చంద్రారెడ్డి, మండల తహశీల్దారు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.



సబ్‌కలెక్టర్‌కు సమస్యను విన్నవిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి గంగునాయుడు, గ్రామస్తులు

ఆత్యం మైనింగ్ అరాచకాలు ఆపాలి

దర్యాప్తు నివేదిక బయట పెట్టాలి
సిపిఎం జిల్లా కార్యదర్శి గంగు నాయుడు డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

గరుగుబిల్లి మండలం, పెద్దగొడబ వద్ద గల ఆత్యం మైనింగ్ అరాచకాలు ఆపాలని, గతంలో దర్యాప్తు చేసిన నివేదికను బయటపెట్టి వెంటనే కలెక్టర్ చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. గురువారం పెద్దగొడబలో ఆత్యం మైనింగ్ కంపెనీకి అండగా 40మంది పోలీసులను పెట్టి ఎస్సైలు, సిఐలు కలిసి గ్రామస్తులపై దౌర్జన్యం చేశారని, గత నాలుగు రోజులుగా పెద్దగొడబ గ్రామస్తులు గ్రామంలో నుంచి భారీ వాహనాలు రావద్దని ఆందోళన చేస్తున్నారని చెప్పారు. దీనికి స్పందించి అత్యం మైనింగ్ కంపెనీకి అండగా పోలీసులు గురువారం పెదగొడబ గ్రామంపై దాడి చేసి నలుగురు రైతులను గరుగుబిల్లి పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లిపోవడం దుర్మార్గమన్నారు. పోలీసులు దౌర్జన్యం ఆపాలని, కలెక్టర్ జోక్యం చేసుకుని గ్రామస్తుల మొర వినిపించు కోవాలని కోరారు. పెద్ద ఎత్తున మహిళలు కలెక్టరేట్‌కు వచ్చారని తెలిసి సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడుతో పాటు సిపిఐ నాయకులు తోట జీవ, గరుగుబిల్లి సూరయ్య వారికి మద్దతు తెలిపారు. అనంతరం మహిళలు ఐడిటిఎ పిఒ అశుతోష్ శ్రీ వాత్సవను కలిసి పెదగొడబలో పోలీసులు దౌర్జన్యం గురించి తెలిపారని చెప్పారు. అనేక రోజులుగా పెదగుడబ, చిన్నగుడబ, వల్లరి గుడబ గ్రామస్తులు ఆత్యం మైనింగ్ అరాచకాలు అరికట్టాలని డిమాండ్ చేస్తూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున పోరాడుతుంటే దర్యాప్తునకు ఆదేశించిన జిల్లా అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి రిపోర్టు ఇవ్వలేదని చెప్పారు. వెంటనే ఆ రిపోర్టు బయటపెట్టి ఆత్యం మైనింగ్ అరాచకాలు ఆపాలని, అక్రమంగా కబ్జా చేసిన భూములను, కొండలను గుర్తించి పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ఆత్యం మైనింగ్ అరాచకాలను ఆపకపోతే ప్రజలను కదిలించి పెద్ద ఎత్తున పోరాడుతామని హెచ్చరించారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలని నిరసన

ప్రజాశక్తి - పాచిపెంట

తమ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ మండలంలోని కేసలి పంచాయతీ కుమ్మరివలస గిరిజనులు గురువారం స్థానిక సిపిఎం నాయకులు దీసరి వసంతరావు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సిపిఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటికీ అనేక సమస్యలతో గిరిజనులు బాధలు పడుతున్నారని, కనీస మౌలిక సదుపాయాలు కూడా లేకుండా కష్టాలు పడుతున్నారని, కలుషితమైన చలమ, ఊట నీరు తాగి రోగాలతో గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల నిర్లక్ష్యం వల్ల గిరిజనులకు తాగునీరందని పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. మరికొద్ది రోజుల్లో గ్రామం వద్ద గెడ్డ ఎండిపోయి చలమ నీరు కూడా అందని పరిస్థితి నెలకొందని, కావున వెంటనే అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించి కుమ్మరవలసలో చేతిపంపు వేయాలని కోరారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు మాట్లాడుతూ 8నెలల క్రితం తాగునీటి సమస్యపై ఆందోళన చేపట్టినా అధికారులు స్పందించలేదని, ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు. పాడైన మోటార్‌ను బాగు చేసి ట్యాంకు ద్వారా తాగునీరందించేలా చర్యలు చేపట్టాలని, లేకుంటే దీనిపైన ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో స్థానిక మహిళలు కోడికాల లక్ష్మి, వరాలమ్మ, పార్వతి, సుశీలతో పాటు. స్థానికులు లక్ష్మణరావు, జన్ని నాగరాజు, దీసర బుచ్చియ్య, కోడికాల త్రినాథ తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న గ్రామస్తులు, సిపిఎం నాయకులు

సమస్యల పరిష్కారంలో పాలకులు విఫలం

నాలుగో రోజుకు మున్సిపల్ కార్మికుల సమ్మె



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి- సాలూరు రూరల్

పురపాలక సంఘంలో కార్మిక సమస్యలు పరిష్కరించడంలో పాలకవర్గం పూర్తిగా విఫలమైందని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శి రాముడు, శంకర్ తెలిపారు. గురువారం నాలుగవ రోజు కార్మికుల సమ్మెను ఉద్దేశించి వారు మాట్లాడారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ఒక్క సాలూరు పురపాలక సంఘంలో మాత్రమే కార్మికులు జీతాలు చెల్లించని పరిస్థితి ఉందని కార్మికులకు కనీస అవసరాలైన పనిముట్లు లేవని, సబ్బులు, చెప్పులు, నూనెలు లేవని చెప్పారు. కార్మికులతో పని చేయించుకుంటున్నప్పుడు వారి కష్టసుఖాలు చూడాల్సిన పాలకవర్గం, అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమస్యలను గాలికి వదిలేసారన్నారు. మున్సిపాలిటీలో 29 వార్డులలో ప్రజలందరికీ సేవ చేస్తున్న కార్మిక సమస్యలు చర్చించేందుకు పాలకవర్గ సమావేశం నిర్వహించాలని వారికి రావలసిన బెనిఫిట్స్ వెంటనే ఇవ్వాలని అంతవరకు సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. అధికారులు పాలకుల మెప్పు కోసం పోలరాజు, తాడు రాజు, వెంకన్న, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో కలెక్టరేట్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - సీతంపేట

జీడికి గిట్టుబాటు ధర కల్పించాలని, జిసిసి కొనుగోలు చేయాలని కోరుతూ ఈనెల 17, 18 తేదీల్లో పార్వతీపురం కలెక్టరేట్ కార్యాలయం వద్ద 48 గంటలు ధర్నా చేయనున్నట్టు ఎపి ఆదివాసీ గిరిజన జిల్లా అధ్యక్షులు ఎం లక్ష్మణరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిసిసి ద్వారా 80 కిలోల జీడిపిక్కల బస్తా రూ.16వేలకు కొనుగోలు చేయాలన్నారు. అంతేకాక మండలంలో పాఠశాలలను మూసివేయవద్దని, వంద పడకల హాస్పిటల్‌ను పూర్తి పూర్తి చేయాలని, ప్రభుత్వ మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలని, ప్రభుత్వమే పీజీ కాలేజీ ఏర్పాటు చేయాలని తదితర డిమాండ్లపై ఈ ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు.

కవయిత్రి మొల్ల రచనలు ఆదర్శనీయం

ప్రజాశక్తి - పార్వతీపురం :

కవయిత్రి మొల్లమాంబ రచించిన రచనలు అందరికీ ఆదర్శనీయమని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పేర్కొన్నారు. వాల్మీకి రామాయణాన్ని పామరులకు సైతం అర్థమయ్యేలా తెలుగు భాషలోకి అనువదించిన తొలి తెలుగు కవయిత్రి మొల్ల అని గుర్తుచేశారు. ఆ రోజుల్లో దైర్యంగా రచనలు చేశారని, ఆమె చేసిన సేవలకు గుర్తుగా మొల్లమాంబ జయంతిని రాష్ట్ర పండుగల ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో కవయిత్రి మొల్లమాంబ జయంతి వేడుకలు బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. ముఖ్యఅతిధిగా పాల్గొన్న కలెక్ మొల్ల చిత్ర పటానికి పూలమాలను వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో పార్వతీపురం, పాలకొండ సబ్ కలెక్టర్లు అశుతోష్ శ్రీవాస్తవ, సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, కెఆర్‌ఆర్సి ప్రత్యేక ఉప కలెక్టర్ పి.ధర్మచంద్రారెడ్డి, జిల్లా బిసి సంక్షేమ సాధికారత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా శాలివాహన సంఘ అధ్యక్షులు కొత్తూరు శంకరరావు, కార్యదర్శి ఉరిటి యాదవ్, తెప్పల శ్రీను, ఉరిటి సింహాచలం, ఉరిటి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



కవయిత్రి మొల్లకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

ఏనుగుల సంచారంపై అప్రమత్తం : డిఎఫ్ఒ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

అడవి ఏనుగుల సంచారం పట్ల ట్రాకర్లు అప్రమత్తంగా ఉండాలని డిఎఫ్ఒ ప్రసూన సూచించారు. అడవి ఏనుగులు సంచరిస్తున్న జియమ్మవలస మండలం బాసంగిలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ట్రాకర్లకు సూచనలు ఇచ్చారు. రాత్రి వేళల్లో అడవి ఏనుగుల సంచారంపై ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ సందర్భంగా ట్రాకర్లకు బూట్లు, లైట్లు, జంగిల్ రక్షణ దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కురుపాం రేంజర్ మణికంత ఈశ్వరరావు , బీట్ ఆఫీసర్ రమేష్ ఉన్నారు..

ఇంటర్ పరీక్షా కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి పార్వతీపురం రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలను ఎస్పి ఎస్‌వి మాధవరెడ్డి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షా కేంద్రాల చుట్టూ వున్న పరిసరాలను, తీసుకున్న భద్రతా చర్యలు, పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో ఇంటర్ పరీక్షలు జరిగేలా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష జరుగుతున్న తీరును అధికారులను అడిగి తెలుసుకున్నారు. అన్ని పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరూగుంపులుగా ఉండకూడదన్నారు. తగిన ఎస్కార్ట్‌తో ప్రశ్నాపత్రాల తరలింపు, సమాధాన పత్రాలు డిపాజిట్ చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో ప్రవేశించే విద్యార్థులు, ఇన్విజిలేటర్లను, ఇతర సిబ్బందిని తరువుగా తనిఖీ చేసి మొబైల్‌ఫోన్లు, స్మార్ట్ వాచ్‌లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులు వినియోగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు.



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పి

పైపులైన్‌కు మరమ్మతులు

ప్రజాశక్తి - పాలకొండ

నగర పంచాయతీ పరిధిలోని ఐదో వార్డులో తాగునీటి కొళాయి పైపులైన్లు మరమ్మతుకు గురికావడంతో గురువారం ఐదో వార్డు కౌన్సిలర్ వెలమల మన్మధరావు దగ్గరుండి ఆ పనులు చేయించారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రూ.13.50లక్షలకు ఆశీల పాట ఖరారు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీలో గురువారం ఆశీల పాటు వేలం జరగ్గా రూ.13 లక్షల 50 వేలకు దుర్గారావు అనే వ్యక్తికి ఖరారైంది. గతంలో రూ.9లక్షలకు ఖరారవ్వగా ఈఏడాది రికార్డ్ స్థాయిలో పెరిగింది. ఇద్దరు వ్యక్తులు పోటీ పడగా దుర్గారావు ఈ ఆశీల పాటను దక్కించుకున్నారు. కార్యక్రమంలో కమిషనర్ టి.జయరాం, కౌన్సిలర్లు వెలమల మన్మధరావు, కె.మోహన్, విజయకుమార్ ఉన్నారు.

బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - పాలకొండ

అర్హులైన అభ్యర్థులు బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపిడిఒ ఎం.విజయ రంగారావు అన్నారు. 18 నుంచి 50ఏళ్లలోపు వారు ఈనెల 10 నుంచి 22 తేదీలోగా ఆయా పరిధిలో ఉన్న సచివాలయాల్లోని మీసేవ కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 23 నుంచి 26 వరకు కార్యాలయంలో దరఖాస్తుల పరిశీలించి జిల్లా కలెక్టర్ పంపిస్తామన్నారు.

పెద్దూరులో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని దశమంతపురం సచివాలయం పరిధి పెద్దూరు గిరిజన గ్రామంలో గురువారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, జ్వరపీడితులు, మధుమేహ, రక్తపోటు, తదితర రకాలైన వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

అతివేగం ప్రమాదం

ప్రజాశక్తి - వీరఘట్టం

అతివేగం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున వాహనదారులు మితిమీరి వేగంతో వాహనాలు నడపరాదని ఎస్సై జి కళాధర్ ఆటో డ్రైవర్లకు సూచించారు. గురువారం స్థానిక పాత బస్టాండ్ ఆటో స్టాండ్‌లో వాహనదారులతో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మితిమీరి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని, వాహనాల ప్రయాణించే వారిని గుర్తించి వాహనాలు నడపాలన్నారు. ప్రతి ఆటోకి సీరియల్ నెంబర్ ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కృష్ణంనాయుడు, ఆటో డ్రైవర్లు ఉన్నారు.

వారపు సంతపై అవగాహన

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలో గురువారం జరిగిన వారపు సంతకు ట్రైనీ ఎస్సైలను ఎస్పై పి. నారాయణరావు తీసుకెళ్లి వారపు సంత, గిరిజనుల జీవన విధానం గూర్చి అవగాహన కల్పించి డ్రోన్ కెమెరాను విడిచిపెట్టి దాని ప్రాముఖ్యత గూర్చి వివరించారు. అనంతరం మండలంలోని సందుబడి, సేకుపాడు, రంగుపురం, దండుసుర గ్రామాలకు ట్రైనీ ఎస్సైలను తీసుకెళ్లి అక్కడ ప్రజలకు సైబర్ నేరాలు, రహదారి భద్రతా నియమాలు, గిరిజన, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎల్విన్‌పేట ఎస్సై బి.శివప్రసాద్, ట్రైనీ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పి- 4 సర్వే వేగవంతం చేయండి

ప్రజాశక్తి - మక్కువ

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి-4 సర్వేను ఈనెల 15లోగా పూర్తి చేయాలని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి సచివాలయం సిబ్బందిని ఆదేశించారు. గురువారం తూరుమామిడిని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన మినీ గోశాలలు, ఇంకుడు గుంతలను పరిశీలించారు. స్థానిక సచివాలయంలో సర్వే జరుగుతున్న తీరుపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ఆర్.కృష్ణంనాయుడు, టెక్నికల్ అసిస్టెంట్ జె.శ్రీకాంత్, ఫీల్డ్ అసిస్టెంట్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి- పాచిపెంట

గర్భిణుల్లో రక్తహీనత నివారణలో భాగంగా 'అమ్మకు అమృత ఆహారం' అనే పేరుతో పోషకాహర కిట్లను మండలంలోని తక్కువ రక్తహీనత ఉన్న గర్భిణులు 83 మందిని గుర్తించి వారికి అందించేందుకు కిట్లును గురువారం అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించామని సిడిపిఒ బి.అనంతలక్ష్మి తెలిపారు. అంగన్వాడీ కార్యకర్తల ద్వారా ఆ కిట్లను గర్భిణులకు అందిస్తామన్నారు. ఈ కిట్లలో వేరుశెనగ, అవిసె చెక్కీలు, 9 రకాల చిరుదన్యాలతో చేసిన బిస్కెట్లు, తీపి ఉసిరి, జొన్న, కొబ్బరి, బెల్లంతో చేసిన ఉండలు, బియ్యం, శెనగపప్పుతో చేసిన జంతికలు, నువ్వలతో చేసిన చెక్కీలు 8 రకాల పదార్థాలు ఉన్నాయని ఆమె తెలిపారు.

తాడికొండలో పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాడికొండ గ్రామంలో గురువారం పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలో జ్వర పీడితులు నమోదు అవుతున్న నేపథ్యంలో ప్రజలను అప్రమత్తం చేసి వ్యాధుల నివారణకు పారిశుద్ధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి మల్లేశ్వరరావు తెలిపారు. గ్రామంలో ఉన్న వాటర్ ట్యాంక్, తాగునీటి కొళాయిల వద్ద క్లోరినేషన్ చేయించామన్నారు. గ్రామంలో ఉన్న వీధి కాలువల్లో మురుగు నీటిని తొలగించి పూడిక తీతలు కార్యక్రమం నిర్వహించామన్నారు. గ్రామం మొత్తం పారిశుద్ధ్య కార్యక్రమాలతో తీర్చిదిద్దినట్లు తెలిపారు. ముఖ్యంగా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని, ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు.

యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని కొండబారిడి గ్రామ యువతకు నీలకంఠాపురం ఎస్ఐ ఎ.నీలకంఠరావు గురువారం వాలీబాల్ కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చదువుతోపాటు క్రీడల్లో కూడా రాణించాలని క్రీడలు మానసిక ఉల్లాసానికి శారీరక దారుఢ్యానికి దోహదపడతాయని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ యువత పెద్దలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

137 గిరిజన గ్రామాలకు తాగునీరు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

నియోజకవర్గంలో ఉన్న 137 గిరిజన గ్రామాలకు జలజీవన్ మిషన్ ద్వారా తాగునీరు అందించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ఉన్న 137 హాబిటేషన్స్ రూ. 1663.80 లక్షలతో ఇంటింటికి తాగునీరు అందించేందుకు టెండర్లు పిలుస్తున్నట్లు ఆమె చెప్పారు.

దృష్టి లోపాలను సరిచేసుకోవాలి: కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలో ప్రతి ఒక్కరూ తమ దృష్టి లోపాల పరీక్షలను నిర్వహించుకొని, వాటిని సరిచేసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రపంచ గ్లకోమా వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి, స్థానిక లయన్స్ కల్యాణ మండపంలలో ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం జరిగింది. ఈ కార్యక్రమాలకు కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో నిర్వహించిన కంటి పరీక్షల్లో పాల్గొని తమ కళ్లను పరీక్షించుకున్నారు. అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ దష్టి లోపాలు ఉన్న వారంతా తమ లోపాలను సరిచేసుకునేందుకు ఇదొక సదావకాశమన్నారు. దృష్టి లోపాలున్న వారికి ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తుందని, ఉచిత పరీక్షలను చేయడంతో పాటు అవసరమైతే శస్త్రచికిత్సలు నిర్వహించి, కంటి అద్దాలను కూడా అందిస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై తమ కంటి పరీక్షలు నిర్వహించుకొని, లోపాలను సవరించుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు, జిల్లా ప్రోగ్రామ్ అధికారి డా.ఎం.వినోద్ కుమార్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ వైద్యాధికారులు, లయన్స్ ప్రాజెక్ట్ చైర్మన్ డా.జి.వాసుదేవరావు, కన్వీనర్ డా.యన్ దుర్గాప్రసాద్, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేయించుకుంటున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

సంస్కృత భాష గొప్పదనాన్ని అందరికీ చాటాలి

పార్వతీపురంరూరల్: సంస్కృతం గొప్పతనాన్ని అందరికీ చాటాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక జిల్లా పరిషత్ సంస్కృత ఉన్నత పాఠశాలలో గురువారం స్వామి వివేకానంద విగ్రహాన్ని కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతత భాష చాలా గొప్పదని, భాషను నిలుపుకోవలసిన అవసరం జాతికి ఎంతైనా ఉందని అన్నారు. స్వామి వివేకానందుని బోధనలు ప్రతివారూ ఆచరించదగ్గవన్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పలు శ్లోకాలను విద్యార్థులు చదవగా వారిని అభినందించారు. 10వ తరగతి విద్యార్థులకు వాసవి మాత దీవెనగా క్లబ్ కోశాధికారి వరద ఉదయ్ కుమార్ సమకూర్చిన అట్టలను, పెన్నులను, స్కేళ్ళను, పెన్సిల్ లను కలెక్టర్ విద్యార్థులకు అందజేశారు. లైన్స్ క్లబ్ అధ్యక్షులు బిఎన్‌బి రావు 12 కుర్చీలను కలెక్టర్ ద్వారా పాఠశాలకు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. తిరుపతి నాయుడు, మండల విద్యాశాఖాధికారులు వై.విమల కుమారి, కె.ప్రసాదరావు, పాఠశాల హెచ్.ఎం. గోర్జ హేమ సుందరావునాయుడు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయిలో జిల్లాకు మొదటి స్థానం తీసుకురావాలి : కలెక్టర్

పార్వతీపురం టౌన్: పదో తరగతి పరీక్షల్లో రాష్ట్రంలోనే పార్వతీపురం మన్యం జిల్లాకు మొదటి స్థానం వచ్చేలా కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. స్థానిక డివిఎం ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా టెన్త్ పరీక్షలు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదివితే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని పేర్కొన్నారు. పదో తరగతి పరీక్షల గురించి ఆందోళన చెందొద్దని, పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఒత్తిడిని అధిగమించాలని అన్నారు. ప్రతి విద్యార్థిలో సంగ్రాహక శక్తి ఉందని, దాన్ని సరైన పద్ధతిలో ఉపయోగిస్తే విజయం వరిస్తుందని అన్నారు. ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులకు పెన్ను, ప్లాంక్, వివేకానందుని ఫోటోను విద్యార్థులకు కలెక్టర్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ తిరుపతి నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి: వీరేష్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీలో వ్యాధుల బారిన పడుతున్న గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యాధికారులకు టిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరిచర్ల వీరేష్ దేవ్ సూచించారు. ఏజెన్సీలో విష జ్వరాలు విస్తృతంగా వ్యాపిస్తున్నాయన్న వార్తల నేపథ్యంలో భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు.

విష జ్వరాలను అరికట్టడానికి తీసుకుంటున్న చర్యలను సంబంధిత వైద్యాధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత మెరుగైన సేవలు అందించే దిశగా పనిచేయాలని కోరారు. కొత్తగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రి భవనాలను పరిశీలించారు. పనులు వేగవంతంగా జరిగేలా చూడాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఎంపిడిఒ సాల్మన్‌రాజును కలిసి పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ పటిష్టంగా జరిగాలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళ కార్యనిర్వాహక కార్యదర్శి బిడ్డిక పద్మావతి, మండల కన్వీనర్ పాడి సుదర్శన్‌రావు తదితరులు ఉన్నారు.

టెన్త్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి : పిఒ

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులంతా ఉత్తమ ఫలితాలను సాధించాలని ఐటిడిఎ పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పిలుపునిచ్చారు. మండలంలోని రావికోనలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలను పిఒ బుధవారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో టెన్త్ పరీక్షలు ప్రారంభం కానున్నాయని, ఆ పరీక్షలకు విద్యార్థులు మంచిగా చదివి ఉత్తమ ఫలితాలు పొందాలని ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి ఇష్టంగా చదవాలని, సందేహాలుంటే నివృత్తి చేసుకోవాలన్నారు. పరీక్షలకు వెళ్లే విద్యార్థులు ఎటువంటి ఒత్తిళ్లకు గురికావద్దని హితవు పలికారు. ఉన్నతమైన స్థానానికి చేరుకోవాలంటే పదో తరగతి పునాది అని, అందుకే దీనిపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని పేర్కొన్నారు. అనంతరం స్టడీ అవర్‌లో ఉన్న విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరీక్షించి, టెన్త్‌లో మంచి విజయం సాధించాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ చెప్పారు. ఈ పర్యటనలో ఆశ్రమ ఉన్నత పాఠశాల వార్డెన్, విద్యార్థులు ఉన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

సీతానగరం: ఇష్టంతో చదివితే విషయ అవగాహన సులభంగా వస్తుందని తద్వారా ఉత్తమ ఫలితాలను సాధించాలని జిల్లా సోషల్ వెల్ఫేర్ కోఆర్డినేటర్ ఎస్ రూపవతి అన్నారు. మండలంలోని జోగంపేట డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాఠశాలను ఆమె గురువారం సందర్శించారు.



విద్యార్థులను ప్రశ్నించి జవాబులు రాబడుతున్న పిఒ

ఈ సందర్భంగా ఆమె చేతుల మీద పదో తరగతి విద్యార్థులకు పెన్నులు, అట్టలను పంపిణీ చేశారు. ఈ మేరకు ఆమె 10వ తరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలపై తగు సూచనలు సలహాలను అందజేశారు. విద్యార్థులు సందేహాలుంటే సంబంధిత ఉపాధ్యాయులను అడిగి వెంటనే నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది మన జిల్లా ప్రథమ స్థానంలో ఉండాలన్న పట్టుదలతో ఉన్నామన్నారు. పదవ తరగతి విద్యార్థులు చక్కగా చదివి జిల్లాకు మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ మధు, వైస్ ప్రిన్సిపల్ ఈశ్వరరావుతోపాటు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - గరుగుబిల్లి

స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.తిరుపతి నాయుడు ఫ్లాంక్, పెన్నులు, స్కేళ్లు గురువారం అందజేశారు. విద్యార్థుల పరీక్ష సమయంలో వీటిని ఉపయోగించుకోవాలన్నారు. విద్యార్థులు తప్పక సమయపాలన పాటించాలన్నారు.

సైకిల్ షెడ్ ప్రారంభం

బీల పద్మావతి, సత్యనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్మించిన సైకిల్ స్టాండ్‌ను డిఇఒ తిరుపతినాయుడు ప్రారంభించారు. ఈ ఆయన మాట్లాడుతూ సైకిల్ స్టాండ్ నిర్మాణం విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఇఒ రాజకుమార్, ఎంఇఒలు డి.అప్పలనాయుడు, కొండలరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాత్రుడు, ఎస్ఎంసి చైర్మన్ ఇజ్జురోతు స్వాతి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం: ఈ నెల 17 నుంచి జరగబోయే పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే గిరిజన విద్యార్థులకు గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యూఒ సురేష్‌కుమార్ అట్ట, రెండు పెన్నులు, జామెంట్రీ బాక్స్ అందించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వీటిని సంబంధిత పాఠశాలల హెచ్‌ఎం, వార్డెన్లకు గురువారం పంపిణీ చేశారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు వెళ్లే ప్రతి విద్యార్థిని ప్రోత్సహించాలని ఉద్దేశంతో అధికారులు పై వస్తువులను అందించినట్లు చెప్పారు.

ప్లేట్లు గ్లాసులు పంపిణీ

మరోవైపు డైరెక్టర్, గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఒక ప్లేట్, గ్లాస్, కూర గిన్నె పంపిణీ చేసినట్లు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం ఎటిడబ్ల్యూఒ కార్యాలయం పరిధిలో ఉన్న ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు 4446 పైగా వస్తువులను శనివారం నుండి పంపిణీ చేయనున్నట్లు చెప్పారు.

జనావాసాల మధ్య ఏనుగుల జోన్ వద్దు

ప్రజాశక్తి- సీతానగరం

జానావాసాల మధ్య ఏనుగుల జోన్ పెట్టవద్దని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని అప్పయ్యపేట వద్ద ఫారెస్ట్ అధికారులు చేపట్టిన కందకాల తవ్వకాల పనులను నిలుపుదల చేయాలని స్థానికులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గురువారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రేపటివలస రెవెన్యూ పరిధిలో గల అప్పయ్యపేట గ్రామం వద్ద ఏనుగుల జోన్ పేరుతో ఫారెస్ట్ అధికారులు కందకాలను తవ్వడం ఆపాలన్నారు. ఫారెస్ట్ అధికారుల నిర్వాకంతో అప్పయ్యపేట, రేపటివలస తామరకండీ, పులుగుమ్మీ, గుచ్చిమి, సీతారాంపురం, జోగంపేట గ్రామాల ప్రజలతో పాటు మండల ప్రజలు కూడా పెనుముప్పు పొంచి ఉందని, అధికారులు తక్షణమే పనులు నిలుపుదల చేయాలని లేదంటే ఈ కొండ చుట్టూ గల గ్రామాల ప్రజలను కూడగట్టి భవిష్యత్తు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిపిఎం పార్టీ, ప్రజా సంఘాలు, స్థానికులతో అక్కడ జరుగుతున్న పనులను అడ్డుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డి వేణు, మండల నాయకులు రెడ్డి ఈశ్వరరావు, గవర వెంకటరమణ, ఆర్.రాము, వై. రామారావు, స్థానికులు కె.అప్పారావు, వై.రాంబాబు, బి.సోములు, రాము, యస్.పరమేశు, కస్తూరి సత్తెమ్మ, పుష్పమ్మ, కురసాని, తదితరులు పాల్గొన్నారు.



పనులు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు, గ్రామస్తులు

ఎఎన్ఎంల నియామకం ఎప్పుడు?

ప్రజాశక్తి- పార్వతీపురం

గిరిజన విద్యార్థుల మరణాల పరంపర కొనసాగుతున్న నేపథ్యంలో ఎఎన్ఎమ్‌ల నియామకం దస్త్రంపై మొదటి సంతకం పెట్టామని ప్రకటించిన గిరిజన సంక్షేమం శాఖ మంత్రి సంధ్యారాణి ఎప్పుడు ఏఎన్ఎమ్‌లను నియమిస్తారని గిరిజన సంక్షేమం సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ ప్రశ్నించారు. గురువారం పార్వతీపురం గిరిజన సామాజిక భవనంలో జరిగిన సమావేశంలో రంజిత్ కుమార్ మాట్లాడుతూ గతంలో గిరిజన విద్యార్థులకు వైద్య సేవలు అందించిన ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం చేసిన నిర్లక్ష్యమే ప్రస్తుత ప్రభుత్వం చేయడం మంచిది కాదని అన్నారు. గిరిజన విద్యార్థుల మరణాలు నివారణకు ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది అవసరమన్నారు. ఆదివాసీ ఆరోగ్య సిబ్బంది సేవలు నిలుపుదల తర్వాత గిరిజన విద్యార్థుల మరణాలు పెరిగాయని తెలిపారు. ఈ సమావేశంలో గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పల్ల సురేష్, గిరిజన సంక్షేమం సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు తాడంగి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎసిఎం పిచికారీ

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియా నివారణకు వైద్య, ఆరోగ్యశాఖ సిబ్బంది ఎసిఎం 5శాతం పిచికారీ కార్యక్రమాన్ని మండలంలోని తాడికొండలో గురువారం ప్రారంభించారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ఎసిఎం 5శాతం పిచికారీ చేశారు. మలేరియా కాటు నుంచి రక్షణ కోసం ప్రతి ఒక్కరూ దోమతెరలు వినియోగించాలని, చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యులు బుద్ధేశ్వరరావు కోరారు. మలేరియా నివారణకు ప్రతి ఏటా మార్చిలో ఎసిఎం పిచికారీ పనులను సంబంధిత మలేరియా సిబ్బంది చేపడుతుంటారు. ఎక్కువ శాతం మలేరియా పాజిటివ్ కేసులు ఉన్న గ్రామాల్లో మలేరియా పిచికారి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ జి.అప్పలనాయుడు, ఆరోగ్య సిబ్బంది పి.రాధాకృష్ణ, అర్చన, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

'ఇన్విజిలేషన్' నుంచి మినహాయించండి యుటిఎఫ్

ప్రజాశక్తి - వీరఘట్టం

నిబంధనలు ప్రకారం ఇన్విజిలేషన్ విధుల్లో .. పనిచేస్తున్న పాఠశాలకు ఎనిమిది కిలోమీటర్ల లోపు ఉన్న పరీక్ష కేంద్రానికే టీచర్లను వేయాలని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం పైడిరాజు గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు. అలాకాని ఎడల మినహాయింపు ఇవ్వాలని కోరారు. తలవరం, తెట్టంగి, నీలానగరం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లకు ఎనిమిది కిలోమీటర్ల దూరం దాటి ఉన్న బిటవాడ, గంగంపేట, వీరఘట్టం బాయ్స్, గర్ల్స్ పరీక్ష కేంద్రాలకు ఇన్విజిలేషన్ డ్యూటీలు వేశారన్నారు. గర్ల్ హైస్కూల్లో పని చేస్తున్న మహిళ ఉపాధ్యాయులకు 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న నీలానగరం పరీక్ష కేంద్రానికి ఇన్విజిలేషన్ డ్యూటీలు వేశారన్నారు. తలవరం, తెట్టంగి, నీలానగరం, వీరఘట్టం గర్ల్స్ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఇన్విజిలేషన్ డ్యూటీ నుండి మినహాయింపు ఇచ్చి పరీక్ష కేంద్రానికి 8 కిలోమీటర్లు లోపు పని చేస్తున్న ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్‌గా నియమించాలని ఆయన డిమాండ్ చేశారు. లేకపోతే ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడతారని స్పష్టం చేశారు.

మహిళా సాధికారతకు టిడిపి పెద్దపీట

ప్రజాశక్తి- సీతంపేట

మహిళ సాధికారతకు టిడిపి పెద్ద పీట వేసిందని టిడిపి పాలకొండ నియోజకవర్గం నాయకులు పడాల భూదేవి అన్నారు. ఈ సందర్భంగా ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి టిడిపి మహిళా సాధికారతకు అత్యంత ప్రాధాన్యతనిస్తుందన్నారు. ఇంటిని సమర్ధవంతంగా నడిపే మహిళ, రాజకీయాల్లోనూ మరింత రాణించి సత్తా చాటగలదని గుర్తించిన అన్న ఎన్‌టిఆర్ పురుషులతో సమానంగా మహిళలకు ఆస్తి హక్కు కల్పించారన్నారు. దానికి కొనసాగింపుగా చంద్రబాబు మహిళల ఆర్థిక స్వావలంబనకు డ్వాక్రా పథకానికి శ్రీకారం చుట్టి వారి జీవన స్థితిగతులను మార్చారన్నారు.

రాష్ట్ర స్థాయిలో ఐటిడిఎకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్రస్థాయి పెయింటింగ్స్, ఆర్ట్స్ పోటీల్లో స్థానిక ఐటిడిఎకు ప్రథమ స్థానం లభించింది. బుధవారం విశాఖలో జరిగిన జన్ జాతీయ గౌరవ దివాస్ గిరిజన స్వాభిమాన వేడుకలు 2025 స్టేట్ లెవెల్ ట్రైబల్ పెయింటింగ్ అండ్ ఆర్ట్ కాంపిటేషన్‌లో పార్వతీపురం ఐటిడిఎకు ప్రథమ స్థానం బహుమతి లభించింది. సీనియర్ విభాగంలో మొదటి బహుమతి గుమ్మలక్ష్మీపురం మండలం తాడికొండకు చెందిన మండంగి బాలచంద్రుడుకు రూ.10వేలు నగదుతో పాటు ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. అలాగే జూనియర్ విభాగంలో ద్వితీయ బహుమతి టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరిక రాజేష్, (9 వ తరగతి)కు రూ.5వేలు నగదు బహుమతి, ప్రశంసా పత్రం, షీల్డ్ అందజేశారు. స్పెషల్ బహుమతి ఆరిక గౌతమ్‌కు రూ.వెయ్యితో పాటు, షీల్డ్, ప్రశంసా పత్రం అందజేశారు. అలాగే కన్సోలేషన్ బహుమతి కురుపాం ఎపి మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న ఆరిక అన్వితకు వెయ్యి రూపాయలు, ప్రశంసా పత్రం అందజేశారు. ఈ మేరకు ఐటిడిఎ లైజెన్ ఆఫీసర్, డ్రాయింగ్ టీచర్ రుగడ శ్రీనివాసరావు తెలిపారు. బహుమతులను ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మందారా రాణి అందజేశారన్నారు.



అవార్డు అందుకుంటున్న విద్యార్థులు

నేరాలు ఘోరాలు

గిరిజన బాలిక అదృశ్యం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న గిరిజన బాలిక సోమవారం నుంచి కనిపించడం లేదు. దీంతో ఆ బాలిక తల్లిదండ్రులు లబోదిబోమంటున్నారు. తల్లిదండ్రులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం..... గుమ్మలక్ష్మీపురం మండలం బాలేసు పంచాయతీ గాండ్ర గ్రామానికి చెందిన మండంగి అంజలి (17) శ్రీకాకుళం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం పరీక్షలు రాస్తుంది. అంజలి సోమవారం లెక్కలు పరీక్ష రాసినప్పటి నుంచి నేటి వరకు ఆచూకీ లేదని అంజలి తల్లిదండ్రులు, బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంజలి హాస్టల్‌లో కాకుండా తన స్నేహితురాలైన నిమ్మక లావణ్య రూమ్‌లో ఉంటుందని, లావణ్య ఒక ప్రైవేటు హాస్పిటల్లో ల్యాబ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తుందని అన్నారు. ఎప్పటిలాగే అంజలి కళాశాలకు సోమవారం వెళ్లి లెక్కలు పరీక్షను రాసి రూమ్‌కు వెళ్లేందుకు గాను లావణ్య పనిచేస్తున్న ప్రైవేటు హాస్పిటల్ దగ్గరకు వెళ్లి రూమ్ తాళం తీసుకొని వెళ్లిందని అన్నారు. కానీ అంజలి మాత్రం అదే రోజు మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదని లావణ్య తమకు సమాచారం ఇచ్చిందని అన్నారు. ఈ మేరకు తాము హుటాహుటిన శ్రీకాకుళం బయలుదేరి వెళ్లి, తెలిసిన ప్రదేశాల్లో వెతికామని, చాలా దగ్గర వాకబు కూడా చేశామని అంజలి ఆచూకీ లభ్యం కాకపోవడంతో శ్రీకాకుళంలో పోలీసులకు ఫిర్యాదు చేశామని అన్నారు. కానీ తమ కుమార్తె అంజలి ఆచూకీ నేటి వరకు లభ్యం కాకపోవడంతో అంజలి తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ కుమార్తె అంజలి ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 6305077149 నెంబరుకు ఫోన్ చేయాలని వేడుకుంటున్నారు.

20 లీటర్ల సారాతో వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి- సీతంపేట

మండలంలో చిన్నగోరలో 20 లీటర్ల సారాతో వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేశామని ఎస్ఐ వై అమ్మనరావు తెలిపారు. ఈ సందర్భంగా సారా రవాణా చేసినా విక్రయించినా కేసులు తప్పవని హెచ్చరించారు. సారా రవాణా చేస్తే వాహనాలు సీజీ చేస్తామన్నారు. సారా నిర్మూలనకు అందరు సహకరించాలని కోరారు.

కూటమి నాయకులతో కలిసి వస్తేనే గుర్తింపు

ప్రజాశక్తి -భామిని

టిడిపి అధిష్టానం తెలిపిన ప్రకారం, పాలకొండ టిడిపి నియోజకవర్గం ఇంచార్జి పడాల భూదేవి నియోజకవర్గం కూటమి నాయకులు కలసి వస్తేనే నియోజకవర్గం ఇంచార్జిగా పరిగణిస్తామని భామిని టిడిపి మండల అధ్యక్షులు రవి నాయుడు అన్నారు. గురువారం మండల టిడిపి కార్యకర్తలతో టిడిపి మండలి కమిటీ సభ్యులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల కార్యదర్శి మేడి బోయిన జగదీశ్వరరావు మాట్లాడుతూ స్థానికేతరులకు పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇంఛార్జి ఇవ్వడంపై అధిష్టానం ఆలోచించాలన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కూటమి నిర్ణయానికి వ్యతిరేకంగా పాలకొండ టిడిపి ఇంఛార్జి వ్యవహరించారని, ఇప్పుడు కూడా కూటమి నాయకులతో కలిసి రాకుండా, వ్యక్తిగత కోణంలో టిడిపి ఇంఛార్జి వ్యవహరించడం సరికాదన్నారు. అధిష్టానం ఈ అంశాన్ని పరిశీలించాలన్నారు. తాము ఎంతో కష్టపడి టిడిపి సభ్యత్వం నమోదు చేస్తే, అది తామే చేశామని ఇన్‌ఛార్జి తెలపడం ఎంతవరకు సభవని, టిడిపిని ప్రాణంగా భావించే మండల టిడిపి కార్యకర్తల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని పునరాలోచించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి మండలి కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి మద్దతివ్వండి

రాజన్నదొరను కోరిన గిరిజనులు

ప్రజాశక్తి- సాలూరు

రాష్ట్రంలో ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కారానికి మద్దతు ఇవ్వాలని మండలంలోని జగ్గుదొరవలస గిరిజనులు గురువారం మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొరని కోరారు. రాజన్నదొర నివాసంలో ఎంపిటిసి మర్రి ఆదియ్య, ఉపసర్పంచ్ మెల్లిక భీమా ఆధ్వర్యాన గ్రామపెద్దలు కలిసి సమస్యల్ని వివరించారు. గతంలో ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కరించాలని కోరుతూ జగ్గుదొరవలస గ్రామంలో గిరిజన సంఘాల ఆధ్వర్యాన సుధీర్ఘ పోరాటం చేసిన సమయంలో టిడిపి మాజీ ఎమ్మెల్సీ సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్పీ భంజ్‌దేవ్‌లు ఆందోళన శిభిరం వద్దకు వచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇచ్చారని చెప్పారు. ఇప్పుడు టిడిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు దాటుతున్నా గిరిజనుల ఏజెన్సీ సమస్యకు పరిష్కారం లేదన్నారు. దీనిపై మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర మాట్లాడుతూ ఏజెన్సీ గ్రామాలకు సంబంధించిన ఫైలు గత ప్రభుత్వం హయాంలోనే సిద్దమ యిందని చెప్పారు. ఏజెన్సీ గ్రామాల సమస్య పరిష్కారానికి తన వంతు ఏవిధమైన సహకారం కావాలన్నా అందిస్తానని రాజన్నదొర గిరిజన పెద్దలకు హామీ ఇచ్చారు.

పనుల్లో నాణ్యత పాటించాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఎంపిపి డి.వెంకటరమణ నాయుడు ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. గురువారం మండల పరిషత్తు కార్యాలయం వద్ద జరుగుతున్న కాంక్రీట్ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ నిధుల నుంచి రూ.10లక్షల అంచనా వ్యయంతో కాలువతో పాటు సిసి రహదారి, కల్వర్టు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. చిరస్థాయిగా పేరు నిలిచేలా పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈయనతోపాటు ఇంజనీరింగ్ సహాయకులు పి భాస్కరరావు ఉన్నారు.

చర్చి భూమి మ్యుటేషన్‌పై డిఆర్‌ఒకు ఫిర్యాదు

పార్వతీపురం: సాలూరు పట్టణం పరిధిలో 175/1లో వున్న 3.14 ఎకరాల చర్చి భూమిని నిబంధనలకు విరుద్ధంగా తహశీల్దార్ మ్యుటేషన్ చేశారని నియోజకవర్గ బిజెపి ఇంఛార్జి గొర్రె భానోజీరావు ఫిర్యాదు చేశారు. గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఒ కె.హేమలతని కలిసి ఫిర్యాదు చేశారు. డగ్లస్ ఎడ్యుకేషన్ అసోసియేషన్ పేరిట ఉన్న భూమిని జోసెఫ్ డేనియల్ గోడి పేరిట తహశీల్దార్ మ్యుటేషన్ చేశారని ఆరోపించారు. ట్రస్టు పేరిట ఉన్న కోట్ల విలువైన భూమిని నిబంధనలకు విరుద్ధంగా తహశీల్దార్ మ్యుటేషన్ చేశారని తెలిపారు.